క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



వేలేరు : మండల కేంద్రానికి చెందిన సూత్రపు లక్ష్మి కిడ్నీ సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. ఈ క్రమంలో కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ.3 లక్షలు సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం బాధితులకు అందజేశారు.

గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

దామెర : గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. శనివారం పెట్రోలింగ్‌లో భాగంగా కోగిల్వాయి గ్రామానికి చేరుకున్న పోలీసులకు బొడ్రాయి వద్ద ఇదే గ్రామానికి చెందిన నీల సదయ్య సంచితో అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతని చేతిలోఉన్న సంచిని పరిశీలించగా 10 గుడుంబా 2 లీటర్ల బాటిళ్లు లభించినట్లు తెలిపారు. అతనిని పోలీసులు ప్రశ్నించగా గుర్తుతెలియని వ్యక్తి వద్ద తక్కువ ధరకు గుడుంబా కొనుగోలుచేసి ఇతరులకు విక్రయించగా మిగిలిన బాటిళ్ల తీసుకెళ్తున్నట్లు చెప్పాడని పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పలువురిపై కేసు నమోదు

వేలేరు : మండల కేంద్రానికి చెందిన వల్లపు సమ్మయ్య తనపై దాడి చేశాడని ఆరోపిస్తూ దుండిగల రాజు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరుకు చెందిన దుండుగుల రాజుకు తన భార్యకు మధ్య శుక్రవారం రాత్రి గొడవ జరుగుతుండగా అదే కాలనీకి చెందిన వల్లపు సమ్మయ్య వచ్చి జోక్యం చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా తలపై కొట్టగా రక్తస్రవం అయినట్లు తెలిపారు. అడ్డుకునేందుకు వచ్చిన రమేశ్ అనే వ్యక్తిపై దాడి చేసినట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఇదే సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి తనతో పాటు రమేశ్‌పై దాడి చేసినట్లు తెలిపాడు. బాధితుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓకు సన్మానం



శాయంపేట : సీడీపీఓ భాగ్యలక్ష్మి హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నియామకం అవడంతో శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు ఆమెను శాలువాతో సన్మానించారు. గతంలో పనిచేసిన డీడబ్ల్యూఓ మధురిమ బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో సీడీపీఓ భాగ్యలక్ష్మిని నియమించారు. అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, కవిత, జ్యోత్స్న, శ్వేత, పుష్ప, అరుణ, రమ పాల్గొన్నారు.

పంటరుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీలో రుణమాఫీ పొందిన రైతులు మరల పంటరుణాల పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ రాజమోహన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పంటరుణం కావాల్సిన రైతుల ఆధార్‌కార్డు, 1 బీ, పహాణి, పట్టాపాస్‌బుక్కు జిరాక్స్, ఈసీ కాపీతో పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆదర్శప్రాయుడు కుమారస్వామి

గీసుకొండ : కమ్యూనిస్టుగా నిత్యం ప్రజాసమస్యలపై పోరాడిన కందికొండ కుమారస్వామి ఆదర్శప్రాయుడని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మంద రవి అధ్యక్షతన మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన కుమారస్వామి సంతాప సభకు అశోక్ అతిథిగా హాజరై నివాళులర్పించి మాట్లాడారు. ప్రజాఉద్యమాల్లో అమరులైన వారి త్యాగం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గాదగోని రవి, వల్లెపు ఉపేందర్‌రెడ్డి, రాజ్ పాశ్వాన్, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేశ్, హంసారెడ్డి, ప్రతాప్, వెంకన్న, రాగసుధ, సంధ్య, సావిత్రి రాజమౌళి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌లో ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు లబ్ధిదారుడు యాకూబ్ పాషాకు రూ.2 లక్షల జీవన జ్యోతి బీమా చెక్కును అందజేశారు. ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్ బ్యాంకు మేనేజర్ ఉన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- తేలికపాటి వర్షానికే బురదమయం
- అడుగుతీసి అడుగేయలేని దుస్థితి
- అధికారుల తీరుపై ఆగ్రహిస్తున్న స్థానికులు



గుడెప్పాడ్‌లో బురదమయంగా మారిన అంతర్గత రోడ్డు

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ గ్రామంలో గల అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ఎస్సీ కాలనీకి అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు.. బురదమయంగా మారడంతో కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వెయ్యి జనాభాకు పైగా ఉన్న ఈ పరిధిలో రోడ్డు బాగా లేకపోవడంతో ప్రధానరోడ్డు నుంచి అంతర్గత రోడ్డుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని వాపోతున్నారు. స్పెషల్ ఆఫీసర్ల పాలనలో అధికారులు కనీసం గ్రామాల్లో పర్యటించడం లేదని, మౌళిక వసతుల కల్పనపై శ్రద్ధ వహించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుడెప్పాడ్‌తో పాటు చౌళ్లపల్లి గ్రామంలో కూడా అంతర్గత రోడ్డు దెబ్బతిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని మండిపడుతున్నారు. ఎండాకాలంలో మొరం కూడా పోయలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్లను బాగుచేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

వాటర్ ప్యూరిఫయర్ అందజేత



వాటర్ ప్యూరిఫయర్ అందజేస్తున్న శివప్రసాద్

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన దేవులపల్లి సాంబశివరావు స్మారకార్థం ఆయన శతజయంతిని పురస్కరించుకుని శనివారం సాంబశివరావు కుటుంబ సభ్యులు ప్రాథమిక పాఠశాలకు రూ.30వేలు విలువచేసే వాటర్ ప్యూరిఫయర్ అందించారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌కు విద్యుత్ షాక్ రాకుండా రూ. 8,000 వేలు విలువచేసే ఎర్త్ ఫిట్టింగ్ చేయించారు. సాంబశివరావు కుమారుడు శివప్రసాద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల గంగాధర్ రాజు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య, తిరుపతమ్మ, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకటరమణ, వైస్ చైర్మన్ శ్రీలత ఈ సందర్భంగా శివప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



దామెర: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు దుర్గంపేటలో శనివారం ఆయన బాధిత కటుంబాలను పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు వర్కూటి చేరాలు, పత్తి గంగరాములు అనారోగ్యంతో మృతిచెందగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు సంజీవ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించారు. ధర్మారెడ్డి వెంట కార్పొరేటర్లు శివ, బాబు, మాజీ జెడ్పీటీసీ కల్పన, మాజీ ఎంపీటీసీలు కృపాకర్‌రెడ్డి, జాకిర్‌అలీ బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, నాయకులు శంకర్, రాజమౌళి ఉన్నారు.

అదుపుతప్పిన టీవీఎస్ ఎక్సెల్

- అలస్యంగా వచ్చిన 108 వాహనం



క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

శాయంపేట : రోడ్డుపై గుంతను తప్పించబోయి టీవీఎస్ ఎక్సెల్ అదుపు తప్పిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మాందారిపేట మలుపు వద్ద శనివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. వరంగల్ పట్టణంలోని కొత్తవాడకు చెందిన అంబొట్టి వీరేశం, అతని బావమరిది వెలిశెట్టి నరేశ్ టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై శనివారం రంగాపూర్‌లో జరిగే శుభకార్యానికి హాజరై తిరుగుప్రయాణం అయ్యారు. వీరేశం తండ్రి కోసం పరకాల పట్టణంలో వాకర్ కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తీసుకొస్తున్నాడు. మాందారిపేట మలుపు వద్ద రోడ్డుపై ఉన్న గుంతలను తప్పిస్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో నరేశ్‌కు ఎడమ కాలు విరగగా, వీరేశంకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం అందించారు. అయితే 108 సుమారు గంట వరకు రాకపోవడంతో క్షతగాత్రులు గాయాలతో విలవిలలాడారు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. శాయంపేటకు అంబులెన్స్ లేదని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అంబులెన్స్ కేటాయించామని ప్రకటించినప్పటికీ జాడలేదని పలువురు విమర్శిస్తున్నారు. అంబులెన్స్ మంజూరు చేయాలని కోరుతున్నారు.



గాయపడిన నరేశ్

బాధితులకు ఆర్థికసాయం



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన పల్లెబోయిన సాయిలు ఇటీవల మృతిచెందాడు. సాయిలు కుమారుడు పల్లెబోయిన కర్ణాకర్‌తో 2003–04లో పదోతరగతి చదువుకున్న స్నేహితులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందించారు. శ్రీనివాస్, వేణు, శివాజీ, సుమన్ పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



దామెర : బాలుడిని బరువును పరిశీలిస్తున్న అధికారులు



కమలాపూర్ : తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న రేణుక



శాయంపేట : అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ సునీతారెడ్డి

దామెర : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డివిజనల్ పంచాయతీ అధికారి షరిఫొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. పుట్టిన గంటలోపు నవజాత శిశువుకు ముర్రుపాలు పట్టించాలని అన్నారు. ముర్రుపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తిం పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న బాలామృతం పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన చేపట్టి బరువును పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, పంచాయతీ కార్యదర్శులు నరేశ్, మనోహర్, ఏఎన్‌ఎం ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్లు వనజ, కోమల, ఆశ కార్యకర్త శైలజ పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : వంగపల్లి 2వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక నిర్వహించారు. తల్లులు, గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్లు లలిత, ప్రభావతి, ఆశ కార్యకర్తలు సునిత, రజిత పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పెండెం రాజు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు చౌళ్లపల్లిలో అంగన్‌వాడీ సెంటర్లలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, వాణి, జమున, సుమలత, సరోజన తదితరులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండల కేంద్రంలోని 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బాలింతలకు, గర్భిణులకు, తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. పరకాల సీడీపీఓ స్వాతి, ఎంపీడీఓ శ్రీనివాస్, సూపర్ వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు అనిత, సంపూర్ణ, వినోద, కళావతి ఆయాలు నర్సమ్మ, సుజాతతోపాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక, సాదోనిపల్లి, నూర్జహాన్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి, మంజుల, డాక్టర్ విద్యశ్రీ హాజరై మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలను తాగించడం వలన బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే బాలమృతం తినిపించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, ఏఎన్‌ఎం శోభ, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : పౌష్టికాహార లోపంతో చిన్నారులు బాధపడకూడదని విద్యావారధి అధ్యక్షుడు బీమళ్ల సారయ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌లో గల ఐదు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్ల ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన చేపట్టారు. హెచ్‌ఎం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి బాలరాజు

దామెర : వివిధ సమస్యలతో కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి బాలరాజు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించి, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈజీఎస్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎఫ్‌ఏలకు సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ శారద, టీఏ సురేందర్, ఎఫ్‌ఏలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న బాబా, రవికిరణ్

ఐనవోలు : మండలంలోని ఏకశిల స్కూల్‌లో శనివారం ముందస్తు స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎండీ బాబా విద్యార్థులతో మొక్కలు నాటించారు. మొక్కలను సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ రవికిరణ్, ఇన్‌చార్జ్‌లు నరేశ్, రాకేశ్, రాజు, ప్రేమ్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుగుల మందు వాడకం హానికరం

- బీసీఐ ప్రాజెక్టు సిబ్బంది



రైతులకు అవగాహన కల్పిస్తున్న బీసీఐ ప్రతినిధి

కమలాపూర్ : పంట సాగులో విషపూరిత పురుగు మందుల వాడకం పర్యావరణంతో పాటు మానవాళి ఆరోగ్యానికి హానికరమని బీసీఐ ప్రాజెక్టు సిబ్బంది శ్రీనివాస్, రాజేందర్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో శనివారం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సహకారంతో కేవీకే-నవక్రాంతి ఉత్పత్తిదారుల సంస్థ బీసీఐ ఆధ్వర్యంలో పురుగుల మందు వినియోగం–విష ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంటలకు సోకే తెగుళ్లు, చీడపీడల నివారణ కోసం విషపూరితమైన పురుగు మందుల వాడకంతో రైతుల ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతుందన్నారు. మనుషుల ఆరోగ్యానికి సంబంధించి దీర్ఘకాలిక కేన్సర్, హార్మోన్లపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని, వాటి వినియోగం పూర్తిగా మానేయాలని సూచించారు. యాంత్రిక, భౌతిక జీవ నియంత్రణ పద్ధతులు పాటించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని అరికట్టి నేల ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చని అన్నారు. తద్వారా భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమితో పాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించవచ్చన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట చేన్లలో నీరు నిలిచి తెగుళ్లు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛదనం- పచ్చదనం’లో భాగస్వాములు కావాలి



కమలాపూర్ : ఆశ కార్యకర్తలకు థర్మామీటర్లు అందజేస్తున్న ఎంపీడీఓ బాబు



శాయంపేట : మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

కమలాపూర్ : ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించనున్న ‘స్వచ్ఛదనం–పచ్చదనం’ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ గుండె బాబు కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు స్వచ్ఛదనం–పచ్చదనంపై శనివారం అవగాహన కల్పించారు. 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రతీరోజు చేపట్టాల్సిన రోజు వారి కార్యక్రమాలను వివరించారు. గ్రామాల్లో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు థర్మామీటర్లు లేకపోవడంతో వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి రూ.6 వేల విలువ చేసే థర్మామీటర్లు కొనుగోలు చేసి పంపించగా వాటిని ఆశ కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఏపీఎం నారాయణ, వైద్యాధికారి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఫణిచంద్ర అధ్యక్షతన స్వచ్ఛదనం–పచ్చదనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ, పరకాల సీడీపీఓ భాగ్యలక్ష్మి హాజరై పలు సూచనలు చేశారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని సూచించారు. ఎంపీఓ రంజిత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, వీఓఏలు పాల్గొన్నారు.

హన్మకొండ (పరకాల) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరకాల ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. మండలంలోని నాగారం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఆత్మకూరు, దామెర మండలాలకు చెందిన సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నిరుపేదల ఆరోగ్యసేవల కోసం సీఎంఆర్‌ఎఫ్ నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సీఎంఆర్‌ఎఫ్ అందిస్తున్నామన్నారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులు ప్రభుత్వం అందించే నగదును వినియోగించుకోవాలని అన్నారు. ఆశ కార్యకర్తలు గ్రామాల్లోని పేదప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటే గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పర్వతగిరి రాజు, పరికిరాల వాసు, సాంబయ్య, స్వామి, సొసైటీ డైరెక్టర్ జయ్‌పాల్‌రెడ్డి, సందీప్, రవి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

హన్మకొండ (పరకాల) : పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు శనివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని నడికూడ, పరకాల మండలాల్లో అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 100 మందికి రూ.19లక్షల 57వేల900 విలువచేసే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను, ఆరుగురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, పార్టీ పరకాల మండల, పట్టణ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, నడికూడ మండల అధ్యక్షుడు దేవేందర్ గౌడ్, మాజీ ఎంపీపీ స్వర్ణలత పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

- పరకాల కోర్టు ఏపీపీలు రాధిక, అర్ధకుమార్



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏపీపీలు కె.రాధిక, అర్ధకుమార్

హన్మకొండ (పరకాల) : పోలీస్ శాఖలోని అన్ని హోదాల అధికారులు, ఉద్యోగులు, కానిస్టేబుల్స్ నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పరకాల కోర్టు ఏపీపీలు కె.రాధిక, అర్ధకుమార్ సూచించారు. శనివారం కోర్టులో నూతన చట్టాలపై పోలీసు కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయగా వారు హాజరై మాట్లాడారు. నేర రహిత సమాజమే లక్ష్యంగా కొత్త క్రిమినల్ చట్టాలు రూపొందించబడ్డాయని అన్నారు. ప్రతిఒక్క పోలీసు అధికారి నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పరకాల, ఆత్మకూరు, శాయంపేట సీఐలు క్రాంతికుమార్, సంతోశ్, ప్రమోద్‌కుమార్, దామెర ఎస్సై అశోక్, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

చేయూతనిచ్చిన పూర్వస్నేహితులు



ఐనవోలు : మండలంలోని లింగమోరిగూడెం గ్రామానికి చెందిన వలిశెట్టి రాజు జూలై 24 వ తేదీన అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2003–2004 సంవత్సరంలో అతనితో పాటు పదోతరగతి చదువుకున్న పూర్వస్నేహితులు శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 40వేల ఆర్థికసాయం అందించి పోస్టాఫీసు, ఎల్‌ఐసీలో పిల్లల పేరుతో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. పూర్వస్నేహితులు ప్రవీణ్, రమేశ్, శ్రీనివాస్, రాజేశ్, రవి, రాజు, సాగర్, సంతోశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.